# చిన్నచిన్న బాటసారులున్నారు జాగ్రత్త!

( నా శక్తి మేరకు మీ పిల్లల్ని క్షేమంగా కాపాడుతాను. మీరంతా అదే శ్రద్ధ నా పిల్లల విషయంలో చూపటం వల్లనే వాళ్ళ క్షేమంగా వుంటున్నారన్న విషయం నేను మరచిపోను. వాహనాయున్న యజమాను సూక్తి ......... ఓ విదేశీసూక్తి.)

ఆర్టీవో ఆఫీసు జనంతో కిటకిటలాడుతూంది. దాని ఆవరణలోకి రాగానే సత్తిరాజు నీళ్లలో పడేసిన చేపలాగా ఇటూ అటూ తిరగటం మొదలు పెట్టాడు. అదే ఆఫీసు రాక్షసులు రాజ్యమేలుతున్న అడవిలాగా ఉంది సింహాచలానికి. అతను రావిచెట్టు కింద మోక్షం కోరి తపస్సు చేసే మునిపుంగవుడిలాగా కూర్చున్నాడు. అతను కాలుస్తున్న చుట్టనుంచి పొగ టాంకునిండా కల్తీడీజల్ నింపుకున్న లారీ అప్పుడే విడిచే పొగలాగా నల్లగా ఉంది.

లోపల గదిలో లైసెన్సు లిచ్చే ఇన్‌స్పెక్టర్ రాజు యమధర్మరాజులాగా కూర్చున్నాడు. అతని కెదురుగుండా కాలేజీ లెక్చరర్ పాపారావ్ నిలబడ్డాడు. నరకంలోకి అవసరం కొద్దీ అడుగుపెట్టిన పుణ్యాత్ముడిలాగా నిర్భయంగా నిలబడ్డాడు పాపారావ్.

"ఏటో ఈ పంతులు, కితం తూరినానొచ్చినప్పుడే వొచ్చి, రాజుబాబుతో దెబ్బలాటేసుకుని ఆ బాబుకి కోపం తెప్పించినాడు. ఆ బాబేమో ఆ కోపం నా మీద సూపించి మళ్ళా రా అన్నాడు. ఈ పాలేటవుద్దో ఏటో" అంటూ సింహాచలం సత్తిరాజు దగ్గర తన భయం వెళ్ళబోసుకున్నాడు.

"ఏటవదు. నా నున్నానుగా" అన్నాడు సత్తిరాజు.

"రూల్ ఎయిటీసిక్స్-సి ఏంటి?" అని రాజు పాపారావ్‌ని ప్రశ్నించాడు.

పాపారావ్‌కి ఈ విధమైన ప్రశ్నలంటే తలనొప్పి. యూనివర్శిటీ పరీక్షలూ ఇంతే ! విద్యార్థికేం అర్థమైందో పరీక్షించవు. ఫలానా ఫార్ములా వ్రాయి, ఫలానా యుద్ధం ఎప్పుడు జరిగింది అంటూ జ్ఞాపకశక్తిని పరీక్షిస్తారు. అందుకని పాపారావ్ క్రితం సారి వచ్చినప్పుడు -

"పెడెస్ట్రియన్ క్రాసింగ్ దగ్గర రైట్ ఆఫ్ వే పెడెస్ట్రియన్దా, బండీ నడిపే వాడిదా ? లాంటి ప్రశ్నలు వెయ్యగూడదా?" అంటూ సలహా ఇచ్చాడు. దానితో రాజు కస్సుమని కోపం తెచ్చుకుని, డ్రైవింగ్ టెస్టులో ఆగే ముందు కుడి చెయ్యి ఎత్తలేదన్న మిషతో మళ్ళీ రమ్మన్నాడు. మళ్ళీ అలాంటి ప్రశ్నే రాజు వేసేసరికి - "నాకు రూల్సేగాని, నంబర్లు తెలియవ్. ఫలానా పరిస్థితుల్లో ఏంచేస్తావ్ అని అడగండి చెపుతాను" అన్నాడు పాపారావ్.

"మరోసారి వచ్చినప్పుడు చెప్దూగానిలే" అన్నాడు రాజు. ఆ జోక్‌కి సత్తిరాజు మామూలుగా నవ్వుతాడు. కాని, పాపారావ్ నవ్వలేదు. పైగా - "నేను ఆర్టీవోని చూస్తాను" అంటూ లోపలికి దూసుకుపోయాడు. అక్కడ ఈ పరీక్షాపద్ధతి అక్రమం, అన్యాయం అన్నాడు. ఆర్టీవో తెలుగు సినిమాల్లో యస్వీరంగారావ్ వేసిన వేషంలా కూర్చుని, నవ్వి, "కూర్చోండి, మేస్టారూ!" అని గౌరవం చేశాడు. ఆపైన రాజుకి కబురు పెట్టాడు. ప్యూన్ వెనకాతల రాజు, కొత్తగా కొన్నవాడి వెనకాతల పోవడానికి మొరాయించే గేదెలాగా నెమ్మదిగానే అయినోచోట, కానోచోట ఆగుతూ నడిచాడు.

"మేస్టార్ని ఏవైనా రెండు ప్రశ్నలు వెయ్యండి, రాజుగారూ!" అని ఆర్టీవో అన్నప్పుడు, ఇలా అయితే అందరికి భయభక్తులు పోతాయి, అప్పుడు తామెందుకు, ఇంతలేసి ఆఫీసు లెందుకు అనుకున్నాడు రాజు. కాని, బయటికి అనలేదు.

"ఒక బండీ మరో బండీని దాటేటప్పుడు ఎటు వైపు నుంచి దాటాలి?"

"కుడివేపు నుంచి."

"రూల్ పూర్తిగా చెప్పండి."

"నా జవాబు మీ కర్థం కాలేదా?"

చూడండి సార్, అన్నట్టు చూశాడు రాజు. "ఇంకో ప్రశ్న వెయ్యండి" అన్నాడు ఆర్టీవో అద్చూసి.

“ముందున్న బండిని ఎడం వేపు నుంచి ఎప్పుడు దాటాలి?”

“ముందున్న బండి కుడికి తిరగటానికిగాను రోడ్డు ఎడం సగంలో కుడి అంచుకు వచ్చి, కుడికి తిరగటానికి గాను, తనకు గల ఉద్దేశం సిగ్నల్ ద్వారా తెలిపినప్పుడు”.

“తప్పు. ముందరే కుడికి తిరగటానికి సిగ్నలిచ్చి ఆ తరువాత ఎడం సగంలో కుడి అంచుకు రావాలి” అని రాజు తప్పు పట్టాడు.

పాపారావ్ నవ్వి, “ఎప్పుడు ఎడం వేపునుంచి దాటాలి అన్నది మీ ప్రశ్న. అంతేకాని, కుడివేపుకి తిరిగే డ్రైవర్ ఏమేం చెయ్యాలని కాదు. ఓ ప్రశ్నకి మరో జవాబు రాసినా, మేం చూసీ చూడనట్టు మార్కులేసి కుర్రాళ్ళని పాస్ చేస్తే........ వాళ్ళు గవర్నమెంటాఫీసుల్లో జేరి ఏ ప్రశ్నకే జవాబో తెలియక తప్పులే ఒప్పులనుకుంటున్నారు. ఒప్పులన్నీ తప్పులనుకుంటున్నారు” అని దెబ్బ కొట్టాడు.

ఆర్టీవో కుర్చీలో సర్దుకు కూర్చున్నాడు.

“రెండ్రోజులు పోయాక వచ్చి లైసెన్సు తీసుకువెళ్ళండి, మేస్టారూ” అని గౌరవంగా చెప్పాడు ఆర్టీవో.

“డ్రైవింగ్ టెస్టో . . . . . ” అంటూ రాజు మాట నాన్చాడు.

“చూడండి, రాజుగారూ! ఈయన వాళ్ళింటినుంచి మన ఆఫీసు దాకా ఆసువే గాని క్షేమంగా పట్టుకొచ్చాడు కదా! ఈ ఊళ్ళో లారీలవాళ్ళు, గేదెలు, గాడిదలు - అన్నీ ఇన్స్పెక్టర్లే. ఆ టెస్టులన్నీ పాసయ్యారు కదా! అందుకని ఈయనకు లైసెన్సిచ్చేయచ్చు. మీరెళ్ళండి, మేస్టారూ!” అల్లా ఆర్టీవోచేత చెప్పించుకుని పాపారావు వెళ్ళి పోయాడు.

ఎంత కూతురి పెళ్ళయినా మేస్టర్లని విరుచుకు తిందామని చూస్తే ఎల్లాగండీ, రాజుగారూ! మేస్టర్లు, స్టూడెంట్లు కందిరీగల్లాంటి వాళ్ళు. వాళ్ళ జోలికిపోకండి. మీ థాష్టీకం అంతా అదిగో మూడో సారొచ్చాడు సింహాచలం - అతనిమీద చూపించండి. ప్రమాదం లేదు, మీరెన్ని ప్రశ్నలేసినా, ఎన్నిసార్లు రమ్మన్నా వస్తాడు. అతన్లాటివాళ్ళందరూ వస్తారు. వాళ్ళకి తెలుసు ... మనకిచ్చేదేదో మనకిస్తేగాని వాళ్ళకు లైసెన్సు రాదన్న విషయం. పుచ్చుకునేదేదో మొదటి తడవ వచ్చినప్పుడే పుచ్చుకోమన్న విషయంకూడా వాళ్ళకి తెలుసు” అంటూ మందలించి, జ్ఞానబోధ చేసి పంపించాడు రాజుని ఆర్టీవో.

సైకిలిస్టు మీదికి దూసుకువెళ్ళే లారీలాగా దూసుకు వెళ్ళాడు రాజు సింహాచలం మీదికి. సింహాచలం చివరి సారి దమ్ము పీల్చి, చుట్ట విసిరేసి వినయంగా లోపలికి వెళ్ళాడు. సత్తి రాజుకూడా వెళ్ళి రాజుకి దండం పెట్టాడు.

“ఏం, రూల్సన్నీ వచ్చాయా?”

“నేర్చుకున్నానండి.” సత్తిరాజు జవాబిచ్చాడు.

"ఏదీ చెప్పమను! స్కూలు జోన్‌లో పిల్లలు రోడ్డు దాటే చోట ఏం చెయ్యాలి?"

"హార్నేస్తానండి."

"మళ్ళీ రా."

"ఈ మారల్లా అనకండి, బాబు! ఆడీసారి లైసెన్సు తీసుకొని గాని ఇంటికి రానని పెతినబట్టి మరీ బయల్దేరాడు. ఇంటికా డీడి ఆడది ఎందుకైనా మంచిదని పసుపుముద్ద, నులకమంచం రెడీగుంచేసింది " అని సత్తిరాజు బతిమాలాడు.

"ఏదీ చెప్పమను!"

"ఎటుంది. ఆడు బ్రేకేసి బండాపేసి, కుర్రగుంటల్ని రోడ్డు దాటనిస్తాడు."

"ఆ లారీకి బ్రేకుల్పడకపోతే?"

"బ్రేకుల్పడకపోతే బ్రేకులిన్‌స్పెట్టరు సత్తెన్నారాయణబాబు లారీ ఓనరు పీకనులిమేయడా?"

"సింహాచలాన్ని జవాబు చెప్పనీ." రాజు గద్దించాడు, సత్తిరాజు మరీ చనువు తీసుకోవడం చూసి.

"ఎట్రా మొద్దు నాగా నిలబడిపోతావ్. బ్రేకుల్లేని బండి నెమ్మదిగా నడపాలని తెలీనట్టు . . . ఈడు మా నోర్లేని మనిసండి. ఎట్టా బతుకుతాడో ఏటో!"

"నెమ్మదిగా తోల్తానండి." సింహాచలం నోరు మెదిపాడు.

"లైసెన్సిత్తే జాగ్రత్తగా బండితోలుకుంటానని చెప్పి కాళ్ళట్టుకోరా" అంటే సత్తిరాజు సింహాచలాన్ని కసిరి, గేర్‌ని రివర్స్‌లోకి గెంటినట్టు అతడిని ముందుకు నెట్టాడు. సింహాచలం కాళ్ళు పట్టుకోలేదు గాని, చూపులో దానికి తను సిద్ధమే నన్న భావం కనపరిచాడు.

"పద, డ్రైవింగ్ టెస్టు పెడతాను" అంటూ రాజు లేచాడు.

"మళ్ళీ అదెందుకు,బాబూ,మీకు సెమ. లైసెన్సిస్తే అడి తిప్పలేవో ఆడు పడతాడు.'

"మళ్ళీ అదెందుకు,బాబూ,మీకు సెమ. లైసెన్సిస్తే ఆడి తిప్పలేవో ఆడు పడతాడు.'

"ఇతడికి డ్రైవింగొచ్చో, రాదో చూడద్దా !"

"వచ్చు బాబు సత్తె పెమానకంగా వచ్చు. అయితే, ఈడికి కానిస్టేబుల్ని, ఇన్‌స్పెట్టర్లని సూత్తే సాలు, సిన్నప్పు డాడమ్మ పెట్టిన ఆముదంతో సా పారు కుంటాడు బాబు అందుకని అడొచ్చి 'ఈ బాబు నీకు దెల్సు, నువ్వు సెప్తే ఇంటాడా బాబు, నా సంగతెప్పి నాకు లైసెన్సిప్పించు అనిబతిమాలితే, జాలేసి లెగిసొచ్చా. మొన్న మా బామ్మర్ది, నారీకింజను యాస్సిలరేటరు ఎటుంటాయో తెలియని ఎదవ, లైసెన్సిప్పించ మంటే, నానేటన్నానో తెల్సా, బాబూ! ఆ బాబు నా మాట మీద గోరవం కొద్దీ నీకు లైసెన్సిచ్చేస్తే, నువ్వులారీని తిరిగొచ్చే దార్లో అందరి మీదకీతోలేసి సంపేయనా? నా నర్థమైనోడికి రికమెండేసన్ సెయ్యను అని కండితంగా సెప్పేశాను . . ఓరి సింహాచలం! తెచ్చిందేదో ఆ బాబు సేతిలో ఎట్టి కాళ్ళట్టుకో అంటూ సత్తిరాజు మధ్యవర్తిత్వం నెరిపాడు.

సింహాచలం చొక్కా జేబులోంచి రెండు వందల్తీసి సత్తిరాజు చేతికిచ్చాడు, రాజు దాన్ని ఓ కంట చూసి కార్బ్యురేటర్‌లో పెట్రోల్చాలక అంటుకోని ఇంజన్లా - "రమ్మను.. టైమైపోయింది... లారీ ఎక్కడుంది" అంటూ కాసేపు దడదడ లాడాడు. అయితే, కుర్చీలోంచి మాత్రం లేవలేదు. రాజుకి తెలుసు మనుషుల్ని మళ్ళామళ్ళా రమ్మంటుంటే రేటు పెరుగుతుందని. అయితే, ఏ రోజు సంపాదనైనా ఆ రోజు పాసైన వాళ్ళద్వారా వస్తుంది గాని, తప్పిన వాళ్ళ దగ్గర్నుంచి కాదు. అంటే, ప్రతి రోజూ కొందరు పాస్ అవాలి. కొందరు తిరిగిరావాలి. ఈ సారి నెగ్గేవంతు సింహాచలంది. అందుకని రాజు కొంచెం బిగిసి చూశాడు.

"ఏట్రా ఇది.. అసలే ఈ బాబు పెళ్ళికర్సుల్లో ఉన్నాడు. నువ్విచ్చింది పైయ్యోల్లకే సాలదు. తియ్యింకో వంద! నే నింటికాడ మూడియ్యాల్రా అని సెప్పనేదా!.. మరి రెండే తీత్తావేట్రా, నంజికొడకా! వచ్చే నెలనుంచి నువ్వు నారీలో పాసెంజర్ల నెక్కించుకుని, బంగారుముద్ద లెట్టేటప్పు డీ బాబుకందులో బాగం యెడతావా? గిల్లి పిల్లి పినరంతైనా యెడతావా?" అంటూ జబర్దస్తీగా సింహాచలం చేత మరో వంద లాగూ జేబులోంచి తీయించాడు.

ఇంటి దగ్గర సత్తిరాజు సింహాచలంతో ముందుగానే చెప్పాడు "సరిగా ఇనుకో నాన్సెప్పేది. ముందుగానే మూడువందల్తీయగలవ్. సచ్చిపోతావ్. ముందుగానే మూడొందలిచ్చిన ఈ నంజికొడుకు దగ్గరింకో వందైనా ఉండకపోదనుకున్నాడా.. ఆ బాబు బిగించుకు కూర్చుంటాడు.. నాల్గొందలిత్తేనే నీ లైసెన్సొచ్చేది. అందుకని ముందుగా రెండొందలిచ్చి! అళ్ళకి పార్టీలు తమంతట తాము ఇచ్చిన్దానిమీద కొసరుచ్చుకుంటే గాని కడుపు నిండదు. ఆ పైన నాన్సెప్పినప్పుడు మరో వందియ్యి" అని.

సింహాచలం డబ్బిచ్చి నిలబడితే "ఒరేయి! నువ్వెళ్ళి బయట నిలబడు" అని సత్తిరాజు సింహాచలాన్ని బయటికిపంపాడు పులి గుహలోంచి బయటపడ్డ మేకలాగా సింహాచలం బయటకు పోయాడు. సింహాచలం బయటకుపోయాక సింహాచలం ఇచ్చిన మూడొందల్లో తనో ఏభైఉంచుకుని మిగిలిన దిచ్చాడు సత్తిరాజు, రాజుకి.

"ఏంటోయి! రేటు పెంచేసినావ్" అని రాజు కళ్లెర్రజేశాడు. సత్తిరాజింకో పాతిక రాజు చేతి కిచ్చాడు. "మ్మా వాణ్ణిమూడ్రోజులు పోయా కొచ్చి లైసెన్స్ తీసుకెళ్ళమను" అన్నాడు రాజు.

బయటకు వచ్చిన సత్తిరాజు చేతిలో సింహాచలం ఓ పాతిక పెట్టి, "ఇందుంచు, గురూ!" అన్నాడు.

"ఎందుకురా ఇది.. నువ్వు మరీను" అంటూ సత్తిరాజు ఆ డబ్బు జేబులో పెట్టుకున్నాడు.

* * *

సీటింగ్‌లో సరిగ్గా ఇమిడిన పార్టులాగా, కుర్చీలో కదలడానికి సందు లేకుండా

కూర్చున్నాడు సత్యనారాయణ. ఎదురుగుండా కుర్చీలో ఇనస్పెట్టెలాటి నర్సిమ్ములు కూర్చున్నాడు. నర్సిములు నలభై ఏళ్ళుగా ఆ ఆఫీసుకు వస్తూనే ఉన్నాడు. పూర్వం బ్రేకిన్స్పెక్టర్లతో నిలబడే మాట్లాడేవాడు. ఇప్పటికీ ఆర్టీవోతో ఆయన కూర్చోమనే వరకు నిలబడే మాట్లాడతాడు. అయితే, చేతి అయిదు వేళ్ళకి అయిదు ఉంగరాలు వచ్చాక బ్రేకిన్స్పెక్టర్ గదిలో తనే కుర్చీ లాక్కుని కూర్చుంటన్నాడు. చాలా కాలం నుంచి ఎరిగున్న సత్యనారాయణ తప్ప మిగతా అంతా అతన్ని నర్సిములుగారూ! అని పిలుస్తారు. ఎవరి కిచ్చేది వాళ్ళ కిచ్చేస్తే మనుష్యు లందరుకూడా స్టార్టింగ్ ట్రబుల్ లేని లారీల్లాగా చకచకా పన్చేసుకుపోతారన్నది నర్సిములి నమ్మకం."సార్జిసేస్తే ఈక్‌బాటరికి పవరొచ్చీసినట్టు డబ్బుసూపిస్తే ఈక్ కేసు స్ట్రాంగైపోతాది" అంటూ ఉంటాడు నర్సిములు.

"ఏమి టిల్లా వచ్చావ్, నర్సిములూ" అంటూ సత్యనారాయణ ఆప్యాయంగా పలకరించాడు.

"కొత్తగా ఏటుంటుంది సతై న్నారాయణబాబూ, మూమూలు పనే! ఏడాది కోపాలి మీ రినీన్‌పెషన్ సేసేసినట్టిచ్చీ కాయితం కోసం మేం మీ సుట్టూ తిరగటం, ఆ పైన అరిగిపోయిన పాత జోళ్ళు ముష్టాడికి ఫారేసి కొత్తవి కొనుక్కోటం."

"మంచివాడివే! మా కోసం తిరుగుతున్నావా? రోడ్డు మీద మీ లారీలు తిరగాలని తిరుగుతున్నావా? అడ్డమైన లారీ తెచ్చి అది అద్భుతంగా ఉందని నన్ను సర్టిఫికేట్ ఇమ్మంటావ్. నీ కళ్ళకి నేనుత్త అమాయకుడి లాగా కనిపిస్తున్నాను కాబోలు!"

"ఎంత మాట!"

"మరి ఆ డొక్కులారీ పుస్తకంకూడా మళ్ళీ తెచ్చావేం?"

"ఏటి, సతైన్నారాయణబాబూ! ఆ బండి రోడ్డెక్కడానికి ఈల్లేదంటే అనుకాని, ఆదే రోడ్డెక్కడాననికి ఈల్లేని కండిషన్‌లో ఉందంటే ఊళ్ళో సాలాబళ్ళు షెడ్డులో ఎట్టేస్కోవాల్సిందే! మా బండీ కేటి తక్కువ?"

"లైట్లు తక్కువ, బ్రేకుల్తక్కువ. దాన్ని పాస్ చేసినవాడికి బుద్ధి తక్కువ. "

"నువ్వులైట్ల మా టెత్తినావ్. ఈ ఊళ్ళో ఈది దీపాల్సాలవా? యేరే లారీలకి దీపాలెందుకు? అందుకే గామోసు మీ గవర్నమెంటు బళ్ళకి దీపాల్తీసేశారు. వాటికి బాక్ లైట్లూ ఉండవు. ముందు లైట్లు ఉండవు. మా లారీకి కనీసం రకాని కొటైనా లైట్లున్నాయి. ఒంటిలైటైనా, ముక్కున రవ్వెట్టుకున్న ఎల్లమ్మలాగా మా లారీ ఎలిగిపోతూ ఉంటుంది. బ్రేకుల్సంగతంటావా? అన్ని లారీలమీద మా అయితే మరో అయిదు గజాలు ఎక్కువ దూరం పోయి ఆగుతుంది మా లారీ. డ్రైవరుషారైనవోడైతే ఏ బెంగా లేదు. "

"మీ డ్రైవర్ గురువులు చాలాహుషారైనవాడే! వాడు కోడిపెట్టల మీద, కుక్కపిల్లల మీద మాత్రమే ఎక్కిస్తున్నాడా, ఇంకా వేటి మీదైనా ఎక్కిస్తున్నాడా ఈమధ్య? ఎందుకైనా

మంచిది ఆ లారీకి బ్రేకులు వేయించెయ్యి. ఎవరన్నా మనుషులు దానికింద పడి చచ్చిపోగల్రు."

"లారీకి బ్రేకులుంటేమాత్రం డ్రైవరు యెదవ నొక్కాలని ఎక్కుడుంది? గురువుల్లాంటోడు సస్తే బ్రేకెయ్యడు మద్దెలో. ఆణ్ణి పన్లోంచి తీసేశాను. ఏటేసేశాడో తెల్సా ఈ మద్దె? మా ఇయ్యంకు డింట్లో పళ్ళిచ్చి రారా అని పంపితే కాంపౌండ్‌గోడ. గుద్దించేశాడు. మా ఇయ్యంకుడు దేవాంతకుపు ముండాకొడుకు. నా కర్చులో మేడేయించీస్తున్నాడు."

"గురువుల్ని పన్లోంచి తీసేసినా, రేపు కొత్తగా వచ్చేవాడు దాన్ని ఎవరి మీదైనా పెడితే మా పీకలత్తెగుతాయి."

" లేదు. ఉషారైన కుర్రోణ్ణి యెడ్తాను. అయినా, ఈ ఊళ్ళో యాస్సిడెంటైతే పోలీసోళ్ళు కోరుటుల్దాకా మీ దాకా రానిస్తారా? రానిచ్చి మీ అందర్తో వాటా లేసుకోడానికి ఆళ్ళేమన్నా పిచ్చోళ్ళా? 'ఆళ్ళుచ్చుకునే దేదో, నా దగ్గరుచ్చీస్కుని యాస్సిడెంటంటా వెక్కడ అయిందేంటి అని ఎరగనట్టు నన్నే డబాయించేస్తారు. అందుకని నీ కిచ్చేది నీ కిచ్చేస్తా. నా కాయితం నా మీద పారెయ్యి" అంటూ నర్సిములు జేబులోని కట్ట సత్యన్నారాయణ చేతిలో పెట్టాడు. అది జేబులో పెట్టుకున్నాక సత్యన్నారాయణ లారీ మాట తప్పిస్తూ, "మీ అమ్మాయీ, అల్లుడూ కులాసాగా ఉన్నట్టు అమెరికా నుంచి ఉత్తరాలొస్తున్నాయా? వెళ్ళప్పుడే పదేళ్ళయినట్టుంది" అని కష్టసుఖా లడిగాడు.

"ఆళ్ళిప్పు డమెరికాలో లేరు. ఆళ్ళ కక్కడ మొహం మొత్తే సింది. మనూరొచ్చీసినారు. అల్లుడు దొరల కంపెనీలో చేరాడు. అమ్మాయీ, అల్లుడూ మనింట్లోనే ఉంటున్నారు. కర్చులు కల్సొస్తాయని మా ఇయ్యంకుడు మాటొరుసకైనా అక్కడుండమన్లా! మనమడు కాన్మెంట్లో జేరాడు. సాకులాటోడు. నా పోలి కొచ్చేసినాది. అడు టి.వి.ఎస్. అంతోడైపోతాడు.. వస్తాను బాబు" అంటూ నర్సిములు లేచాడు.

"మూడ్రోజులు పోయాక వచ్చి పుస్తకాలు పట్టుకుపొండి."

* * *

ఉద్యోగం కావాలంటూ వచ్చిన సింహాచలాన్ని నర్సిములు పరీక్షగా చూశాడు. అతని చూపు డిప్ చెయ్యని లారీ హెడ్‌లైట్ల లాగా తీక్షణంగా ఉంది.

"నువ్వు లారీ నడపగలవా?"

సింహాచలం బేబులోంచి లైసెన్స్‌తీసి చూపించాడు.

"నా న్నీకు లారీ నడపట మొచ్చా అని అడిగాను కాని, నువ్వా రాజుబాబు కేటిచ్చావని అడగలేదు."

"రాకపోతే ఆ బాబు లైసెన్సు ఎందుకిత్తాడు? ఆ బాబు నారీని గల్లీలో ఎట్టించి, అప్పులో రివర్స్ చేయించి మరీ ఇచ్చాడు. ఇంతమంది న్యూసాడటకాని, నా అంత జాగరత్తలో బండి నడిపే వాడిని సూడ్నేదన్నాడు."

"అయితే సూడు. ఆ మూడోలారీని రివర్సులో తీసుకొచ్చి నా పాదాలముందాపాల. ఇదుగో బీగాలు."

నర్సిముల్దగ్గర తాళంచేతులు తీసుకుని లారీ ఎక్కాడు సింహాచలం. సింహాచలం ఆ లారీని నర్సిముల్దగ్గర ఆపుదామని చూస్తే అది ఆతన్ని దాటి ఓ రెండగజా లవతల ఆగింది.

"ఏట్రా ఆ డ్రేవింగు?" నర్సిములు గదమాయించాడు. నర్సిము లదను గమనించి తనదగ్గరపన్చేసే వాళ్ళని, చెయ్యబోతున్న వాళ్ళని ఏరా అని పిల్చేసి ఆదే అలవాటు చేస్తాడు.

"బ్రే కడనేదండి సరిగ్గా."

" అందుకే ఆర్తీయమన్నా. ఏ బండైనా కొత్తగా ఎక్కినప్పుడు ముందరగా బ్రేకులెల్లా ఉన్నాయో సూస్కో అక్కర్లా? అన్నీ సెకింగ్ సేస్కో అక్కర్లా?"

"సెకింగ్ సేసేసరికి లారీ మిమ్మల్ని దాటెళ్ళిపోనాది."

"నీ యావారం సూస్తే ఎడ్డు కానిస్టేబుల్ని డేరేట్టుగా గుద్దింసేసీటట్టున్నావ్. ఆడు సచ్చిపోతే బూమాత బరువు తగ్గి పొద్ది గాని, ముందు పోలీసుల్నా లారీ నట్టుకుపోయి లాకప్పులో యెట్టేస్తారు."

"నేను మడుసుల మీదకి బండితోలే రకం వోణ్ణి కాదు."

"వేటిమీద యెట్టే రకం వోడివేటి? నీ ముందరోడుకూడా మడుసుల్ని ఒగ్గేసి అన్నింటిమీద ఎక్కింసేసీవోడు."

"ఎందుకు, బాబు, ఇయన్నీను. ఓవారం రోజులు నా పన్సూసుకోండి. నచ్చితే పర్మెనెంటుగా ఉంచీసుకోండి లేకపోతే నేదు."

"అయితే నువ్వీ లారీయే తిప్పాల. ఈ బ్రేకుల్సరిగా లేని లారీ ముందర నడిపితే ఒళ్ళు దగ్గరెట్టుకుని నడపటం నేరుస్తావ్. పాత లారీల మీద అనుభవం ఉంటే దార్లో రిపేర్లొచ్చినా ఆ మీదటికి అరిటిపండొల్సినట్టు సేసీస్కోగలవ్."

సింహాచలం మాట్లాడలేదు. కొలువులో కుదురుకున్నాడు.

* * *

సింహాచలం లారీ ఎక్కి సీటుమీద సింహాసనం మీద కూర్చున్నట్టుగా కూర్చున్నాడు. డాష్‌బోర్డు కిందికి కొన్ని వైర్లు తెగి వేల్లాడుతున్నాయి. అవి ఎటూ వెళ్ళని డెడెండ్ వీథుల్లాగా ఉన్నాయి. మిగిలిన వైర్లు బ్రహ్మముడులు పడి, సిటీలో ఏ రోడ్డెటు వెళుతుందో తెలియనట్టు తెలియకుండా ఉన్నాయి. డాష్‌బోర్డుమీద మిక్సెడ్ ట్రాఫిక్ లాగా గొడవ గొడవగా ఉన్నాయి. సింహాచలం ఎదురుగా ఉన్న వెంకటేశ్వరస్వామికి, అన్నవరం సత్యనారాయణస్వామికి, సింహాద్రి అప్పన్నకి ఊళ్ళో విఘ్నేశ్వరుడికి, ఆంజనేయుడికి -అందరికి విడివిడిగానే దండాలు పెట్టుకున్నాడు. తనతో తెచ్చిన అగరొత్తులు పటానికి రెండు వెలిగించాడు. జానెడేసి పూలదండలు

పటాని కోటి వేశాడు. నర్సిములు-"వెళ్ళిరా" అన్నాడు. సింహాచలం చక్రాల కింద పెట్టిన నిమ్మకాయలు కసుక్కుమని పచ్చడి చేస్తూ ముందరికి నడిపాడు.

ప్రతి వీధి మలుపు దగ్గర సింహాచలం చెవులు రిక్కించి మరీ విన్నాడు. హారన్ మోత మోగించాడు. లారీ నెమ్మదిగా నడిపాడు. ఎంత నెమ్మదిగా నడిపాడంటే, సువేగా మీద వెళుతున్న పాపారావ్ కూడా సైడివ్వలేదు. సింహాచలం లోడ్ చెయ్యాల్సిన చోటికి వెళ్ళి ఇంజనాపకుండా కిందకు దిగి టైర్ల కిటు పక్క, అటు పక్క రాళ్ళు పెట్టాడు. లారీ లోడ్ అవుతున్నంతసేపూ ఇంజన్ "పదపద" అంటూ తొందరపెడుతున్నట్టే అనిపించింది సింహాచలానికి. సింహాచలం లారీని లోడ్ చేసుకుని, ఆ లోడ్‌ని చేర్చాల్సిన చోటికి చేర్చాడు. మొదటి ట్రిప్పు సరిగ్గా పూర్తయినందుకు సింహాచలం మురిసిపోయాడు.

రెండో ట్రిప్పులో సైకిలిస్టుల్ని, సువేగా జనాన్ని హారన్ కొట్టి హడల కొట్టాడు. మూడో ట్రిప్పుల్లో లారీ కడ్డు వచ్చిన పిల్లల్ని, వాళ్ళని కన్నవాళ్ళతో కలిపి తిట్టడం దాకా పెరిగాడు. నాలుగో ట్రిప్పులో లారీ స్లో చేసి కిటికీలోంచి తల బయటకు పెట్టి, లారీ ఆపాల్సిన అవసరం లేకుండా తిట్టగలిగాడు. అల్లాగ సింహాచలం ట్రిప్పు ట్రిప్పుకి ధైర్యం, ఉత్సాహం, స్పీడు పుంజుకున్నాడు. సాయంత్రం అయిదయే సరికి సింహాచలం ఉత్సాహానికి పట్ట పగ్గాల్లేకుండా పోయాయి. ఆ సమయంలో అతని లారీ ఖరీదైన కాన్వెంటున్న రోడ్డు మీద మతి తప్పిన గేదెలాగా పరుగెత్తుతూంది.

ఆ కాన్వెంటు విడిచి పెట్టి పది పదిహేను నిమిషాలైంది. పిల్లలందరు ఇళ్ళకు వెళ్ళిపోయారు. కాని, ఇద్దరు పిల్లలు-పది పన్నెండేళ్ళ పసివాళ్ళు, ప్రపంచంలో జరుగుతున్న అన్యాయానికి ఏ విధంగాను బాధ్యులు కానివాళ్ళు-మిగిలిపోయారు. అందులో ఒక కుర్రాడి కోసం వచ్చే కారు కోసం ఇద్దరు నిరీక్షిస్తున్నారు. ఆ కుర్రాడు రెండో కుర్రాడిని దారిలో దించేసి పోతాడు రోజూ. మొదటి కుర్రాడి యూనిఫారమ్ ఖరీదైన బట్టల్తో చేసింది. రెండో వాడు వేసుకున్నది సాధారణం. ఆ చదువే రెండో వాడి తండ్రి తాహతుకు మించింది. పిల్లవాళ్ళు కబుర్లలో పడ్డారు.

"అక్కడ అమెరికాలో, పిల్లలు రోడ్డు దాటుతుంటే పెద్ద పెద్ద కార్లు, స్పీడుగా పోతున్నవికూడా ఠక్కున ఆగి పోయి దారిస్తాయి-తెలుసా? అల్లా చెయ్యకపోతే అక్కడ లైసెన్సులు పీకేస్తారుట. మా డాడీ చెప్పాడు" అన్నాడు మొదటి అబ్బాయి.

"ఇక్కడా అంతేట. మా నాన్న చెప్పాడు" అన్నాడు రెండోఅబ్బాయి, మొదటి వాడి మాటలు మరీ డాబుగా ఉన్నట్టు తోచి.

"ఇక్కడ అల్లా ఆగరుట. ఇక్కడేమో డ్రైవింగ్ రాకపోయినా, లైసెన్సులిస్తారుట-

మాడాడీ చెప్పాడు. అల్లాగే మా మమ్మీ కిక్కడ లైసెన్సిచ్చారుట'' అన్నాడు మొదటి అబ్బాయి కళ్ళు తిప్పుకుంటూ.

రెండో అబ్బాయి నీ మాటలు కష్టపెట్టాయి. ''అదేం లేదు. ఇక్కడ అందరు చాలా జాగ్రత్తగా డ్రైవ్ చేస్తారుట. మా డాడీ చెప్పాడు'' అన్నాడా అబ్బాయి, డాడీ అన్న మాటను వత్తి పలుకుతూ, మా నాన్న చెప్పాడు అన్న కంటే మా డాడీ చెప్పాడన్న దానికి కొంచెం బలం ఎక్కువలా తోచి.

''చెయ్యరు. ఇది స్కూల్‌జోన్ కదా! ఇక్కడందరు నెమ్మదిగా డ్రైవ్ చెయ్యాలి అవునా? కాని, చూడు-అందరు ఎంత ఫాస్టుగా పోతున్నారో! ఇదే అక్కడైతేనా? మోటారుసైకిళ్ళ మీద కూర్చున్న పోలీసులు ఫైన్ వేస్తారు'' అన్నాడు మొదటివాడు.

ఇక్కడ మరీ అంత అన్యాయం కాదని ఋజువు చెయ్యాలని రెండో వాడికి బలమైన కోరిక కలిగింది. ఆ పిల్లాడి దృష్టికి దూరంగా వస్తున్న సింహాచలం లారీ కనిపించింది. ''అదిగో, ఆ లారీ ఆగుతుందో, లేదో చూద్దాం'' అన్నాడు.

మొదటిపిల్లాడు తటపటాయించాడు. అవతల కుర్రాడు అంటున్నట్టుగా ఆ లారీవాడు ఆగితే ఫరవాలేదు. కాని, తనంటున్నట్టుగా ఆ లారీ ఆగకపోతే... ''వస్తున్నావా?లేదా?'' అంటూ రెండో కుర్రాడు రెట్టించాడు. మొదటి వాడు ఆమాత్రం తొందరగా దాటలేనా అనుకున్నాడు. ఈ టైములో సింహాచలం లారీ యాభై అడుగుల దూరంలోకి వచ్చింది. అది గమనించకుండా మొదటివాడు ''పద'' అన్నాడు. ఇద్దరు పిల్లలు రోడ్డుకడ్డం పడ్డారు. మతి తప్పిన గేదె లాగా లారీ మీదకు వచ్చింది.

సింహాచలం హారన్ కొట్టాడు. 'ఆ గుంటళ్ళు కావాలనే రోడ్డు దాటుతున్నట్టున్నారు. ఏటి సేతున్రా బగమంతుడా! ముందే తెలుస్తే స్లో సేసేవాడిని' అని ఆలోచించి బ్రేకు తొక్కాడు.

లారీ ఆగింది. అయితేనర్సిములు చెప్పినట్టు ఈ లారీ తీసుకోవలసిన దానికన్నా అయిదు గజాలు ఎక్కువ తీసుకుని ఆగింది. అయిదు గజాల వెనకాతల లారీ మట్టేయగా మట్టిలో కలిసిపోయిన పిల్లలిద్దరున్నారు. పసిపిల్లల రక్తం పెద్దల తప్పులు చూడ్డానికి సిగ్గు పడుతున్న కర్మసాక్షి మొహంలా ఎర్రగా పారింది.

జనం మూగుతుండగా మొదటి కుర్రాడికోసం కారు వచ్చింది. ఆ కారు డ్రైవరు నెత్తీ నోరూ బాదుకుని, ''ఆ పువ్వులాటి కుర్రోడు నర్సిములు బాబు మనుమడు. ఈ రెండోవాడు లైసెన్సులిన్‌స్పెక్టరు రాజుగారి కొడుకు'' అని చూస్తున్న వాళ్ళకి వివరిస్తున్నాడు.●

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక నవంబర్ 1974)